# కుమాతా న భవతి

"శ్రీ రామసెంద్రా! ఇశ్శో!" అంటూ పాక ముందున్న మట్టి అరుగుమీద కూరల బుట్ట దించినాది బోడెమ్మ. "పాడు రైలు. ఇంతాలీసమై పోయినాది. కూడొండేతలికేయాలైతదో" అనుకుంటూ లోపలికెళ్ళింది.

"తోకోడోయ్! ఒరే తోకోడా!" అంటూ కొడుకును కేకేసింది. తోకోడు ఆమె కొడుకు. వాడంటే ప్రాణాలు విడుస్తుంది బోడెమ్మ. ఒక్కగానొక్క కొడుకు. శాస్త్రుల్లుగారు వాడికి కూడా "హనుమంతు" అని నామకరణం చేసినా అదేమిటో వాళ్ళ వంశంలో అందరికీ హనుమంతుడిపేరే. కాని ఎవ్వరూ అలా పిలవరు. తోకాడనే పిలుస్తారు. వాడు కూడ "హనుమంతూ!" అని పిలిస్తే పలకడు.

"ఈ మాదు గాసులోడు పైటాం బండికొచ్చి సావదేస్తుంది" అనుకొనింది బోడెమ్మ. "సోకలు కొచ్చుంటే ఇయ్యాల రావాల. అగ్గిరెడ్డపల్లెలో ఎంకట్రావి కొస్తరేమో! చెక్క తండుంగాడ గొలుసు నాగటం అలవాటై పోయిందెదవనకు." అని గొణుక్కుంటూ పొయ్యి రాజేసి, సూకలన్నం వండింది. వండ లోంచి చింతకాయ తొక్కుతీసి, రోట్లో ఉప్పు, మిరపకాయలు దంచుకొని దాన్లో తొక్కువేసి మెత్తగా దంచుకుని, "సాదకం" తయారు చేసింది. బుడ్డిదీపం వెలిగించి పొయ్యి దిమ్మకాడ పెట్టి ఒక్క 'చనం' సంజె దీపాన్ని ధ్యానించింది. తడిక తలుపు సేరేసి, 'మట్టా అరుగుమీద కూకొనింది'

ప్రక్క పాకలోంచి "మేకమ్మ" పలుకరించింది "ఏంటే బోడెమ్మ! తోక నాబట్ట ఇంకా రాలేదా యేమి?"

"లేదు మాదే! ఎంకట్రావికి రాగా కుహా, పోలీసోళ్ళకు గీస దొరికితే ఒల్లు వాయగొడరని సెప్పినా ఇనడు" అన్నది బోడెమ్మ.

ఆ పాక కర్నూలుకు 30 కి.మీ. దూరంలో వుంటుంది. గుంతకల్-సికింద్రాబాద్ సెక్షన్ అది. ద్రోణాచలం జంక్షన్ నుంచి కర్నూలు టవున్‌కు లోకల్ రైలు 'షటిల్' తిరుగుతుంది. ఆ ప్రాంతంలో పేద, బిక్కికి ఆ రైలే జీవనాధారం. రోజూ దాదాపు వెయ్యిమందికి పైగా ఆ రైల్లో కర్నూలుకు వెళ్తుంటారు. కట్టెల మోపులు, నెయ్యి, పెరుగు, పాలు, తేనె, గడ్డి మోపులు అమ్ముకొనేవాళ్ల ఆ రైలుకు ఉదయమే కర్నూలు వెళ్ళి పదో పరకో సంపాదించుకు కొని వస్తారు. విచిత్రమేమిటంటే దాని పేరు "ఇందిరమ్మ సోకలు".

కుర్ర వెధవలు చాలామంది కర్నూల్లో రిక్షాలు తొక్కడానికి వెళతారు. ప్రతి వాడూ ఇరవై ముప్పై రూపాయలకి తక్కువ సంపాదించరు. సినిమా చూసి

— పాణ్యం దత్తశర్మ



రావాలంటే 'నోకలు' అందదు. అందుకే "ఎంకటాద్రి" ఎక్కేస్తారు. సికింద్రాబాదునుండి తిరుపతి వెళ్ళే ఎక్స్‌ప్రెస్ రైలది. కర్నూలు వదిలితే ద్రోణాచలం దాకా ఎక్కడా ఆగదు. కాని శోకలు మిస్సయిన వాళ్ళంతా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కడం, గొలుసు లాగి దిగి పరిగెత్తడం పరిపాటి. రైల్వే అధికారులు ఎంత ప్రయత్నించినా అదుపు కాలేదు. ఆ లైన్లో ఏ రైలుకూ, ఎవరూ టికట్ కొనరు. సర్కారు జిల్లాలో టి. టి. ఇ. లకైనా కనీసం కొంత డబ్బు ఇస్తారు. రాయల సీమలో ఆ దీ లేదు. ఏమన్నా అంటే ఆ టికెట్ ఎక్జామినర్‌ను తన్నడానికైనా సిద్ధమే.

"యమ్మా! యమ్మోయ్!" అనుకుంటూ తోకాడు వచ్చినాడు.

"నీకేమి పొయ్యేకాలంరా! దినరోజూ ఎంకటాద్రికే సత్తన్నవు?" అన్నది బోడెమ్మ లేచి.

"జల్ది బువ్వపెట్టు. రాములవారి గుడికాడికెల్లాల" అన్నాడు వాడు విన్పించుకోకుండా.

అన్నంతిని బయట పడినాడు తోకోడు. ముసలమ్మ గోని బొంత పరచుకొని పడుకుంది. తానూ ఇంత తిని. ఆమె ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

"లగ్గం జేత్తామంటే దుడ్డు గావాల. సెడు సావాసాలు మరిగినాడు దొంగెదవ ఇంటికాడ పెళ్లాముంటే సొంగ కారుస్తూ ఆడే వొస్తడు. ఇలటికి ఒక్క రూపాయి ఇవ్వడు. కూరలమ్మిన దాంతోటే ఇల్లు గడపాలంటే ఎన్నేళ్ళు లాగుతది బండిని. అనుకున్నది.

రేత్తిరేల ఎప్పుడో వచ్చినాడు తోకోడు తల్లికాడే పడుకున్నాడు. ఏకుజామున సల్లి పెడతాంటే బొంత తీసి వాడికే కప్పింది. "తిక్క సన్నాసెధవ! నోకం తెలీనోడు! ఎట్ట బతుకుతడో!" అంటూ ప్రేమగా తల నిమిరింది.

పొద్దున్నే కూడొండి, ఊళ్లోకి బయలెల్లినాది బోడెమ్మ. కూరలమ్ముకొని ఇల్లు సేరి, కూడు తిని, కుసింత నడుము వాన్చినాది. ఇంతలో పక్కింటి మేకలమ్మ ఒకన్నెం చేసుకోనొచ్చింది.

"బోడీ! ఈనది బేతంసెర్లట. తోకోడికి పిల్లనిస్తానని వొచ్చినాడు" అంది.

"కూసో" మనింది బోడెమ్మ. పిల్లకు 'ఎంతీడు' అనడిగింది. సవర్తాడినాదా లేదా తెలుసుకుంది. "నలుపైనా నచ్చికల" అన్నాడా పెద్ద మనిషి. పిల్లకు పుస్తెలు చేయించి, వచ్చినోల్లకు సక్కెర బువ్వ, పుగ్నాలు పెడితే చాలన్నాడు.

"మా వోడు రానీ, మూడంబోనీ, ఇంటితనం సూస్నీ కొత్తాం" అన్నది ముసలమ్మ.

"మీ రాజీ" అంటూ వెళ్ళిపోయినాడు "ఇయ్యంకుడు."

కొడుకొస్తూనే సంబరంగా సంబంధం గురించి చెప్పింది ముసల్ది. "పల్లెటూరోల్ల సంబంధమా! స!" అన్నాడు వాడు.

తర్వాత కొన్ని దినాలకు 'నోకలు'కు మూంచి కుర్రదాన్నెంచేసుకోనొచ్చినాడు. "యమ్మోయ్! దీనిపేరు "రత్తం" దీనిబాబు మేత్రీపని సేత్తాడు. నీ వొప్పుకుంటే దీన్ని లగ్గమాడతాను" అన్నాడు.

తనకు చెప్పకుండా కొడుకు స్వతంత్రించినందుకు బాధ పడింది బోడెమ్మ.



కాని "నీ వొప్పుకుంటే" అన్నందుకు కొంచెం ఓదార్పు చిక్కింది. ఒప్పుకోకున్నా వినడని తెలుసు.

మూడం బోయినాక లగ్గం జరిగింది.

రత్తం పట్టవాసం పిల్ల. 'గిల్టు జుంకీలు' 'నెక్కిలేసు' వేసుకొనేది. అద్దం, దువ్వెన, నూని, పవుడర అన్నీ రేకు డబ్బాలో కర్నూలునుండే తెచ్చుకునింది. ముసల్దంటే లెక్కలేదు. పొయ్యి దగ్గరికి పొరపాటునైనా పోదు.

తోకోడికి కొత్త బారియ. దాంట్లో పట్నం పిల్ల. అదేంసేసినా కోపం వచ్చేది కాదు. కొడుకూ, కోడలూ లోపల పడుకుంటే తాను బయట అరుగుమీద పడుకునేది బోడెమ్మ.

రాత్రానుత 'రత్తం' దురుసుతనం ఎక్కువయింది. 'పాడుకొంప' అని విసుక్కునేది. మొగుణ్ణికూడా ఇష్టం వచ్చినట్లు మాట్లాడేది. "ముడ్డోడు ముడ్డి సచ్చినోడు" అని తిట్టేది. తననేమన్నా పడేది కాని, కొడుకును తిడితే సహించేదికాదు బోడెమ్మ.

తోకోడికి తాగటం అలవాటయింది. దానికితోడు వస్తూనే ముసల్దానిమీద ఇన్ని చెప్పేది రత్తం. తల్లిని పట్టుకొని కొట్టేవాడు.

ఒకరోజు తెల్లారంగానే కొడుకూ, కోడలూ ఏవో మూటలు సర్దుతూండగా అడిగింది బోడెమ్మ. "ఏందిరా! యాడికి పయానం?"

"నీ పీడ వదలేమే అయిగ కర్నూల్లోన వుంటాం. ఆడైతే నేను బీర్ల కంపిన్లో కెల్తాను. నీ సావు నువ్వు సావు" అన్నది కోడలు.

కొడుకేం మాట్లాడలేదు.

నిజమేనా తోకోడా?" అనడిగింది బోడెమ్మ. "సన్నిడిసి పెట్టి పోతవా! నానుండలేను కొడకా, నా కూడు నేను సంపాదించుకుంట నన్ను దీసుకపో నాయనా, నీకాడే బడుంట," అన్నది కళ్ళనిండా నీళ్ళతో,

"సువ్వొస్తే రత్తం ఇనదు" అన్నాడా పుత్రరత్నం.

ముసల్ది ఎంతగానో బ్రతిమిలాడింది. కోడల్ని పల్లెత్తుమాట అనని 'ఎల్లమ్మ' మీద బాస చేసింది. కొడుకును పట్టుకొని ఏడ్చింది. కోడల్ని ప్రాధేయ పడింది. వాళ్ళు వినలేదు. కనికరం లేకుండా వెళ్ళిపోయినారు.

బోడెమ్మ "కుల్లి కుల్లి" ఏడ్చింది. ఎప్పుడూ తోకోడే గుర్తుకొచ్చేవాడు. "సింతకాయ తొక్కు నేకుంటే ముద్ద ఎత్తేవాడు కాదు తిక్కెదవ" అనుకునేది విచిత్రమేమిటంటే భార్య మోజులో నిర్లక్షనా చేసి వెళ్ళిపోయినాడనే ఆలోచన వచ్చేదికాదు."వాడు లేకుండా ఉండాల్సి వచ్చెననే" అని, బాధ.

కూరలమ్మి డబ్బు 'తాడికర్చు' కుపోను మిగిలేది. చూరు మీద మూత్తలో

దాయసాగింది. రోజూ కర్నూలుకు బోయి "ఎత్తండం" (హోల్‌సేల్) కూరలు తెచ్చుకునేటపుడు కొడుకొను చూడాలస ప్రాణం పీకేది బోడెమ్మకు. కాని కోడలు గయ్యాళి తనానికి జడిసి ఊరుకొనేది.

బిర్లాకాడనే గుడిసేసు కున్నారని, కోడలూ పన్లో కెల్తదని తెలుసుకుంది. ఒకనాడు మేకలమ్మ వచ్చింది. "పొయ్యే కాలం గాకపోతే, సోద్దెంసూడు!" అంటూ

"పట్టం జెరిన తర్వాత రత్తం బిర్లాలో పనికి బోతున్నదట. అక్కడ హమాలీ గాడొకడు దాన్ని తగులు కున్నాడట. తోకోడికి తెలిసి దాన్ని కొట్టబోయినాడట సెయ్యిపడితే మరేద దక్కదు" అని వాడి మీదికే వెళ్ళిందటది. ఇంకోరోజు ఈడు రిచ్చా కెల్లిందే గుడిసెలోనే వాడితో తొంగుందట. అసూ ఈడూ కొట్టుకున్నారట. ఏంటో గోరకలి!"

తర్వాత కొన్ని రోజులకు బోడెమ్మకు తెలిసింది రత్తం వాడిని వదిలేసి వెళ్ళి పోయిందనీ, మద్దెదవ! సరసంసీతెలీదు! మద్ది దానికి పుట్టినోడు! అని తిట్టిందనీ, దాన్ని పట్టిన హమాలీ గాడు రాత్రిదారి కాసి తోకోడిని కొట్టించాడనీ.

ముసల్దానికి 'కాలు సేతులాడలేదు.' వెంటనే పాసింజర లో బయలు దేరింది. ముంతలో దాచిన డబ్బు తీసుకుంది. టేసన్ల దిగ్గానే, 'రిచ్చల' బిర్లాకాడి కెల్లింది.

"నాయినా. ఎల్లుర్తి కాడినుంచి తోకోడనే వోడు గుడిసేసు కునుంటున్నాడు యాడ నాయినా? అంటూ వాకబు చేసింది చివరకు గుడిసె కనుక్కో గలిగింది.

లోపల ఒక మూల ఈత చాప మీద తోకోడు పడివున్నాడు. జ్వరంతో ఒళ్లు కాలిపోతూవుంది. ముఖం పీక్కుపోయింది. బాగాదితక్కొట్టారేమో ఒళ్ళంతా వాచి వుంది.

"ఒరే నాయినా తోకోడా," అని ఆక్రోశిస్తూ కొడుకు మీద పడిపోయింది బోడెమ్మ." ఓర్నాయినో! నాకొడుకుకేమయినాదిరో! నా తో కొన్ని సంపేసినారమ్మో! అంటూ గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. తోకోడు స్పృహలో లేడు.

చివరికీ ధైర్యం తెచ్చుకొని రిచ్చా మాట్లాడి సాయం పట్టించి టేసన చేరింది నోకలులో ఊరు చేరింది. మేకలమ్మ, మొగుడూ కలిసి ఎట్లో గుడిసె చేర్చినారు.

తక్షణం తన చీరలు రెండు ఈత చాపపై పరిచింది. గోనె బొంత కప్పింది. వాడు అస్పష్టంగా "యమ్మా !" అన్నపుడల్లా "ఓ నా తోకోడో!" అంటూరాగాలు తీస్తూంది.

"గులుకోసు నీలు పోస్తే జొరం తగ్గతద" అంది మేకలమ్మ. వెంటనే డబ్బిచ్చి పంపింది ముసలిది. పొయ్యి మీద నీళ్ళు మరిగించి ఒళ్ళంతా కాపడం కాసింది. 'గులుకోసునీలు' తాపించింది. రాత్రంతా జాగారం చేసింది. తోకోనికి కొద్దిగా తెర పిచ్చింది.

"పొద్దునే డాకటరు కాడికెల్లి సూది మందేయించాల" అనుకుంది బోడెమ్మ. నరాలు తేలి, ఎముకలూ, చర్మమూ మాత్రమే వున్న ఆమె చేతులు ఆప్యాయంగా తోకోడిని స్పృశిస్తూ వున్నాయి. బుడ్డిదీపం వెలుగులో ఆమె మాతృత్వం రూపుదాల్చినట్లుగా ప్రకాశిస్తూంది. అది శంకరుల శ్లోకానికి ఆకృతిలాగుంది.

